క్లుప్తంగా

పత్తి పంటపై రసం పీల్చే పురుగు ఉధృతి

ఏఈఓ రాజు



ముప్పారంలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ

అల్లాదుర్గం(మెదక్): పత్తి పంటకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి రసం పీల్చే పురుగుల ఉధృతి ఉందని ఏఈఓ రాజు చెప్పారు. బుధవారం మండల పరిధిలోని ముప్పారంలో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి పంట పైన రసం పిలిచే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించినట్లు తెలిపారు. పత్తి పంట పై ఉన్న రసం పీల్చే పరుగుల నివారణ కొరకు పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎకరానికి జిగురు అట్టలు 10 నుంచి 12 చొప్పున పత్తి చేనులో పెట్టుకుంటే రసం పీల్చే పురుగులు పసుపు రంగు ఆకర్షణకు చిగురు అట్టాల పైన వచ్చి అతుక్కొని చనిపోతాయన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలి

ఎంపీడీఓ చంద్రశేఖర్



ముప్పారంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ

అల్లాదుర్గం(మెదక్): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముప్పారం గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూముల్లో, రోడ్ల వెంబడి మొక్కలు నాటడంతో పాటు, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, కాంగ్రెస్ నాయకులు బల్‌రాం, శేషారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్లాన్ ఇండియా ప్రాజెక్టు ప్రతినిధులు

చిన్నశంకరంపేట(మెదక్): బాలల సంరక్షణ చట్టాలపై ప్లాన్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. బుధవారం చిన్నశంకరంపేటలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద బాలల హక్కుల రక్షణకు కల్పించిన చట్టాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ప్లాన్ ఇండియా ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాహుల్, ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సోషల్ వర్కర్స్ మంజుల, రవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు మాలతి, నాగరాణి, జ్యోతి, రేణుక పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నర్సాపూర్, శివ్వంపేట, కొల్చారం తదితర మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఆయా మండలాలకు చెందిన పార్టీ నాయకులకు అందచేసి వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆమె వారికి సూచించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి, అశోక్‌రెడ్డి, శివకుమార్, మహిపాల్‌రెడ్డి, సుదీప్, గోవర్దన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.
మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండ గ్రామానికి చెందిన రాజుకు రూ. 22,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎంపీ ఈటల రాజేందర్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ కార్యవర్గ సభ్యుడు ఠాకూర్ లక్ష్మణ్‌సింగ్, తదితరులు ఉన్నారు.

తాగి వాహనాలు నడిపితే చర్యలు

అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి

టేక్మాల్(మెదక్): మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి హెచ్చరించారు. బుధవారం టేక్మాల్ మండలం బొడ్మట్పల్లి చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు పొందిన తర్వాతే వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా నడపరాదన్నారు. ప్రైవేటు వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. రోడ్డు నిబంధనలు ఎవరూ అతిక్రమించినా చర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ దేవదాస్, సిబ్బంది కృష్ణ, రాజేందర్, మురళి ఉన్నారు.

ఫుట్‌పాత్‌లపై ట్రాన్స్‌ఫార్మర్లు

25 కరెంటు స్తంభాల ఏర్పాటు
- కనీసం ఫెన్సింగ్ ఏర్పాటు చేయని వైనం
- అవస్థలు పడుతున్న జనం

నర్సాపూర్: ఫుట్‌పాత్ డ్రైనేజీ పైకప్పులపై ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నర్సాపూర్ పట్టణం మీదుగా జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌తో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించారు. రోడ్డు పక్కన ఉన్న పలువురు వ్యాపారులు తమ దుకాణాల ఎదురుగా ఉన్న డ్రైనేజీ పైకప్పుతో పాటు ఫుట్‌పాత్‌లపై తమ సామాన్లు పెట్టడంతో ప్రజలు నడిచి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. తాజాగా విద్యుత్ శాఖ అధికారులు ఫుట్ పాత్, డ్రైనేజీ పైకప్పులపై శాశ్వత గద్దెలు నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్లు పెడుతుండటంతో ముందు డ్రైనేజీలో ఏదైనా సమస్య తలెత్తితే ఎలా చేస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ వైరు ఇతరత్రా వైర్లు ఉంటాయని వాటి పక్క నుంచి తాము ఎలా నడిచి వెళ్లాలని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక బస్టాండుకు ఎదురుగా ఉన్న ఫుట్‌ఫాత్‌పై పది నెలల కాలంలో పలు భవనాల కోసం విద్యుత్ శాఖ అధికారులు రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం మరో ట్రాన్స్‌ఫార్మర్ బిగించేందుకు గద్దె నిర్మించే పనులు చేపట్టారు. ఫుట్‌పాత్‌పై సుమారు 50మీటర్ల దూరంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు పెడితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. కాగా గతంలో ఫుట్‌పాత్‌పై పెట్టిన ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. కాగా ఫుట్‌పాత్‌పై మెదక్ మార్గంలోని ఫుట్‌పాత్‌పై విద్యుత్ అధికారులు గతంలో ట్రాన్స్‌ఫార్మర్ పెట్టారు. దాని చుట్టూ ఎలాంటి ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. దానిని తొలగించాలని పలువురు కోరగా.. అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. పట్టణంలో సుమారు 25 కరెంటు స్తంభాలు ఫుట్‌పాత్ మధ్యలోనే ఉన్నాయి. వాటిని తొలగించేందుకు ఆ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.



నర్సాపూర్‌లో ఫుట్‌పాత్‌పై పెట్టిన ట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలో మరో గద్దె నిర్మిస్తున్న దృశ్యం



ఫుట్‌పాత్‌పై ట్రాన్స్‌ఫార్మర్ పెట్టేందుకు కొత్తగా నిర్మిస్తున్న గద్దె

ఇప్పటికే నోటీసులు ఇచ్చాం..

రోడ్డు పక్కన నిర్మించే ఫుట్‌పాత్ ప్రజలు నడిచి వెళ్లేందుకు నిర్మిస్తారు. దానిపై ఎలాంటి నిర్మాణాలు, ఆక్రమణలు చేయడానికి వీలుండదు. పలువురు వ్యాపారులు తమ దుకాణాల సామాన్లు ఫుట్‌పాత్‌పై పెట్టవద్దని ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. కాగా ట్రాన్స్‌ఫార్మర్ కోసం గద్దె నిర్మిస్తున్న విషయం తన దృష్టికి రాలేదు.

– శ్రీరామ్ చరణ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

తప్పని పరిస్థితుల్లోనే..

ఏడీఈ రమణారెడ్డి వివరణ కోరగా.. పెద్ద భవనాలకు కరెంటు సరఫరా చేసేందు కోసం ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వాటి కోసం తప్పనిసరి పరిస్థితిలో ఫుట్‌పాత్‌పై ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం.

మెదక్ రూరల్ సీఐని సన్మానించిన ఎస్పీ



రూరల్ సీఐని సన్మానిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డిని బుధవారం ఎస్పీ శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జోనల్ లెవెల్ పోలీస్ మీట్‌లో సాంకేతిక పరమైన అంశంలో సీఐ ప్రథమ స్థానం పొందినట్లు తెలిపారు. ఏదైనా నేర ఘటనలో నిందితులకు కోర్టులో శిక్ష పడాలంటే సాంకేతిక పరమైన సాక్ష్యాలు చాలా కీలకంగా పని చేస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రివార్డు మంజూరు చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి అల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నిజాంపేట మొదటి స్థానం

వ్యవసాయ శాఖ అధికారి సోమలింగారెడ్డి

నిజాంపేట(మెదక్): ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ విషయంలో నిజాంపేట మండలం జిల్లాలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. మండల పరిధిలో మొత్తం ఆరువేల మంది రైతులకు గాను 5,214 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, మిగతా వారు కూడా త్వరితగతిన చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు 12 అంకెల సంఖ్యను కేటాయిస్తామన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి బిజ్జిపూర్‌లో అట్రాసిటీ కేసుకు సంబంధించి బుధవారం తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ విచారణ జరిపారు. ఆదివారం రాత్రి బిజ్జిపూర్ గ్రామంలో కులం పేరుతో పలువురు దూషించడంపై కేసు నమోదైంది. దీంతో డీఎస్పీ గ్రామంలో పలువురిని విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. చట్టానికి వ్యతిరేకంగా పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం సంఘం విద్యార్థులు జిల్లాలో ర్యాలీలు నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తోందని సంఘం నాయకులు పేర్కొన్నారు.



రామాయంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

కదంతొక్కిన కార్మికులు

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు

దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మెదక్ జిల్లాలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు కదంతొక్కారు. ర్యాలీలు, ప్రదర్శనలు, రాస్తారోకోలతో నిరసన తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని, లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కొన్ని చోట్ల పాక్షికంగా బంద్ పాటించారు. జీఓ 282 జీవో వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతోందని సీఐటీయూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.



మనోహరాబాద్: జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న సీఐటీయూ కార్మిక నాయకులు



శివ్వంపేటలో రాస్తారోకో చేస్తున్న కార్మికులు



చిన్నశంకరంపేటలో మానవహారం నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు.



వెల్దుర్తిలో ధర్నా చేస్తున్న కార్మికులు



కొడిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ రంగాల కార్మికులు



:పాపన్నపేటలో ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, ఆశావర్కర్లు



పెద్దశంకరంపేటలో ఆందోళన చేస్తున్న కార్మికులు



చేగుంటలో రస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు



నర్సాపూర్‌లో ర్యాలీలో పాల్గొన్న ఆయా రంగాల కార్మికులు, నాయకులు

అలంకారప్రాయమేనా..!

అన్ని హంగులతో పాఠశాల భవనం పూర్తి
- తాగునీటి సమస్య కారణంగా ప్రారంభించని వైనం
- విద్యార్థులకు తప్పనితిప్పలు



గౌతాపూర్‌లో ప్రారంభానికి నోచుకోని నూతన పాఠశాల భవనం

చిలప్‌చెడ్(నర్సాపూర్): లక్షలు ఖర్చు చేసి, కార్పొరేట్ హంగులతో నిర్మాణం పూర్తయిన పాఠశాల భవనం. అకడమిక్ సంవత్సరం పూర్తవుతున్నా ప్రారంభానికి నోచుకోలేదు. అన్ని వసతులు ఉన్నా కేవలం తాగునీటి సమస్య కారణంగా భవనం అలంకారప్రాయంగా మారింది. దాంతో నూతన పాఠశాల భవనంలో ఇబ్బందులు లేకుండా చదువుకోవచ్చు అనుకున్న విద్యార్థులకు నిరాశే ఎదురైంది. చిలప్‌చెడ్ మండలం గౌతాపూర్ గ్రామ శివారులో 2013లో రూ.30 లక్షల ఆర్‌వీఎం నిధులతో ప్రారంభమైన పాఠశాల నిర్మాణం 2015 వరకు పూర్తయింది. అయితే.. భవనాన్ని వినియోగించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. సుమారు ఎనిమిదేళ్ల పాటు వినియోగంలో లేకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరింది. గౌతాపూర్‌లో ఒకే ఆవరణలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు నడవడం ఇబ్బందిగా ఉండడంతో అధికారులు శిథిలమైన పాఠశాల భవనాన్ని పరిశీలించి, మన ఊరు, మనబడి పథకంలో నిధులు మంజూరు చేయడంతో 2023 నుంచి పాఠశాల మరమ్మతులు ప్రారంభమయాయ్యయి. ప్రస్తుతం ఆ భవనం కార్పొరేట్ పాఠశాలను తలపిస్తుంది. సుమారు రూ.85 లక్షల నిధులతో ఆ పాఠశాలలో విద్యుత్, మరుగుదొడ్లు, వంటగది, డైనింగ్‌హాల్, పాఠశాల చుట్టూ ప్రహరీగోడ నిర్మాణాలు సైతం పూర్తయ్యాయి. పాఠశాలలో విశాలమైన మైదానం ఉన్నప్పటికీ భవనం మాత్రం నిరుపయోగంగానే ఉంది. సమస్యలను పరిష్కరించి, భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గౌతాపూర్ గ్రామస్తులు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారికి వినతి పత్రాలు అందజేశారు.

గంగిరెద్దులగూడెంలో పశువైద్య శిబిరం



లేగదూడకు వైద్యం చేస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని సోమక్కపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని గంగిరెద్దులగూడెంలో బుధవారం మండల పశువైద్యాధికారి వినోద్‌కుమార్ ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 'సంచార పశువైద్యశాలలో మందులు కరువు' అనే కథనానికి స్పందించారు. దీంతో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు వైద్యం చేయడంతో పాటు, మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ పశువుల్లో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు తప్పనిసరిగా వేయించాలని కోరారు. పశువైద్యం అందించేందుకు తమ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గట్టయ్య, శంకర్, సతీష్ పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణాలు

ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్



మాట్లాడుతున్న ఏపీఎం సంగమేశ్వర్

కొడిపల్లి(నర్సాపూర్): మహిళలను కోటీశ్వరులను చేయడంలో భాగంగా ప్రభుత్వం మహిళ సంఘాలకు ప్రత్యేక రుణాలు ఇస్తుందని ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్ తెలిపారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో ఇందిర మహిళ శక్తి సంబరాలలో భాగంగా కొడిపల్లి గ్రామ సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళ సంఘాలకు ప్రత్యేకంగా రుణాలు ఇస్తుందన్నారు. ఆర్టీసీ బస్సు, సోలార్ విద్యుత్ ఏర్పాటు, మినీగోదాం నిర్మాణం, పౌల్ట్రీ మొబైల్ ఫిషర్ ఆటో, క్యాంటీన్‌లు, ఎంటర్‌ప్రైజెస్ తదితర వ్యాపారాల కోసం రుణాలు ఇస్తుందని వివరించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కొత్తగా డ్వాక్రా సంఘాలు, వృద్ధులు, కిశోరబాలికలు, వికలాంగుల సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మహిళ సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య కార్యదర్శి రాధిక, పూర్ణిమ, పద్మ, జయమ్మ, నవనీత, కవిత, సీసీ రమేష్, వీఓఏలు లాల్య, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

అల్లాదుర్గం(మెదక్): పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రాం అన్నారు. బుధవారం అల్లాదుర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందన్నారు. సకాలంలో ఇళ్లు కట్టుకున్నవారికి వెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, కార్యదర్శి ప్రభకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ వైభవంగా రథోత్సవం

పెద్దశంకరంపేట(మెదక్): ఆషాఢమాస ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీరుక్మిణీ విఠలేశ్వర ఆలయ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం గ్రామ పురవీధుల గుండా రథంపై ఉత్సవ విగ్రహాలను బాజాభజంత్రీలు, కీర్తనలు, భజనల మధ్య ఊరేగించారు. దారి పొడవునా మహిళలు ఉత్సవ విగ్రహాలకు మంగళహారతులతో స్వాగతం పలికారు.

◆ తడి, పొడి చెత్తపై అవగాహన

నర్సాపూర్: తడి పొడి హానికరమైన చెత్త పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి చెప్పారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులలో ప్రజలకు పలురకాల చెత్తపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. తమ సిబ్బంది సూచించిన విధంగా చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాల సిబ్బందికి అందచేయాలని ఆయన కోరారు. కాగా మురికి కాలువల పక్కన ,ఖాళీ ప్రదేశాలలో పెరిగిన గడ్డి పిచ్చి మొక్కలు తొలగించే పనులు చేపట్టామని వివరించారు.

◆ రూ.5లక్షల పరిహారం అందజేత

పాపన్నపేట(మెదక్): వ్యవసాయ పొలం వద్ద కరెంట్ షాక్‌తో మరణించిన రైతుకు రూ.5లక్షల పరిహారం అందజేసినట్టు జోనల్ సీఈ బాలస్వామి తెలిపారు. పాపన్నపేటకు చెందిన బట్టి బాలయ్య మార్చి 23న పొలం వద్ద ,బోరు మోటారుకు కరెంట్ షాక్ రావడంతో అక్కడికక్కడే మరణించాడు. అతని భార్య కిష్టమ్మకు రూ.5 లక్షలు, మంజూరు చేశారు. ఇందులో రూ.50 వేల నగదు, రూ.4.50 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో అందజేయనున్నట్లు తెలిపారు.

◆ ఓటరు నమోదు సక్రమంగా నిర్వహించాలి

చేగుంట(తూప్రాన్): ఓటరు నమోదును సక్రమంగా నిరవహించాలని తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. చేగుంటలో నార్సింగి, మాసాయిపేట మండలాలకు చెందిన బూత్ లెవల్ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటరు నమోదు, ఓటరు కార్డులో మార్పులు చేర్పులకు సంబంధించిన సూచనలు చేశారు. కార్యక్రమంలో మాసాయిపేట తహశీల్దార్ వసంత, నార్సింగి తహసీల్దార్ కరీం, శిక్షకులు ఉమాశంకర్, మధుసూదన్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

◆ ఉచిత వైద్య శిబిరం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి ఉసిరికపల్లిలో బుధవారం పాస్టర్ కరుణాకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు 80 మందికి బీపీ, షుగర్, ఇతర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రిబ్కా, ప్రియ కార్యదర్శి సుష్మ, తదితరులు ఉన్నారు.

◆ మహిళ శక్తి సంబురాలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ మహిళ సంఘాలు మహిళ శక్తి సంబరాలు జరుపుకొన్నారు. వడియారంలో ఏపీఎం లక్ష్మినర్సమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ గ్రామంలోని మహిళ సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగడం కోసం ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రవి

హవేలిఘణాపూర్(మెదక్): బీసీ సంక్షేమ సంఘం మెదక్ నియోజకవర్గ అధ్యక్షుడిగా సాపరవి ఎంపికయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నోముల శ్రీకాంత్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. అనంతరం రవి మాట్లాడుతూ బీసీల సంక్షేమ కోసం తనవంతుగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో అనీల్‌కుమార్, మోహన్‌చారీ తదితరులు ఉన్నారు.

◆ ఎంపీడీఓ బదిలీ



శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా బదిలీ అయ్యారు. దీంతో బుధవారం సిబ్బంది వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. శివ్వంపేట మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎంపీఓ తిరుపతిరెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది నరేందర్‌రెడ్డి, స్వామి, అనీల్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.